www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 1 జనవరి 2026 | 5 | కాకినాడ

కడియం పల్ల వెంకన్న నర్సరీలో పూల మొక్కలతో ఇలా న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు, కుమారులు వెంకటేష్, వినయ్ దీన్ని రూపకల్పన చేశారు.

నూతన సంబరం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లా ప్రజలు నూతన సంవత్సర సంబరాల్లో మునిగారు. 2025కు వీడ్కోలు పలుకుతూ 2026కు స్వాగతం పలికారు. యువతలో నూతన ఉత్సాహం ఉరకలేసింది. బుధవారం రాత్రి నుంచే న్యూఇయర్ వేడుకల్లో తల మునకలయ్యారు. పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ సెంటర్లలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పలు కార్యక్రమాలకు సినీ నటులతో పాటు బుల్లితెర నటులు హాజరై సందడి చేశారు. కాకినాడ నగరంలో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అన్ని దుకాణాలు విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్నాయి. వినియోగదారులతో కిక్కిరిశాయి. పూల దుకాణాల వద్ద వినియోగదారుల రద్దీ ఎక్కువైంది. బొకేలు కొనేందుకు ఎగబడుతున్నారు. బొకేలతో పాటు పండ్ల దుకాణాలు, స్వీటు షాపుల్లో వ్యాపారం పుంజుకుంది. బేకరీల్లో న్యూఇయర్ కేకులకు డిమాండ్ పెరిగింది. వారం ముందుగానే చాలా మంది కేకులకు ఆర్డర్లు ఇచ్చుకున్నారని, ఆ మేరకు కేకులను రెడీ చేశామని బేకరీ యజమానులు చెబుతున్నారు. వివిధ రకాల కేకులను ముస్తాబు చేశారు. రూ.300 నుంచి రూ.30వేల వరకు విలువ చేసే కేకులను తయారు చేశారు. రెస్టారెంట్లలో న్యూఇయర్ ఆఫర్లను పెట్టి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. బుధవారం నగరంలోని అన్ని రెస్టారెంట్లు కిటకిటలాడాయి. రెస్టారెంట్లతో పాటు కాకుండా ప్రతి వీధిలోనూ ప్రత్యేక బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఒకటి కొంటే మరొకటి ఉచితం తహరాలోనూ బిర్యానీ ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. మరి కొన్ని చోట్ల కూల్ డ్రింక్స్‌ను ఉచితంగా అందిస్తున్నారు. దీంతో ప్రజలు బిర్యానీ సెంటర్లకు ఎగబడుతున్నారు. మద్యం దుకాణాలకు సమయం అమ్ముకునేందుకు రాత్రి 12 గంటల వరకూ గడువు పెంచడంతో మందుబాబులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బార్‌లకు రాత్రి 1 గంట వరకూ గడువు ఇవ్వడంతో మద్యం బాబులు క్యూ కట్టారు.

వివిధ పార్టీల కార్యాలయాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. నాయకులు, కార్యకర్తలతో కిటకిటలాడాయి. ఆయా పార్టీల్లో భారీ కేక్ కటింగ్‌లకు కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. తమ అభిమాన నాయకులకు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కాకినాడలోని ఓ రెస్టారెంట్‌లో నిర్వహించిన న్యూఇయర్ వేడుకలు

పిఠాపురంలోని ఓ మద్యం దుకాణం వద్ద మద్యం బాబులు

పోలీసుల గస్తీ పెంపు

న్యూఇయర్ వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు గస్తీని పెంచారు. పలు కూడళ్ల వద్ద పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌లతో నిఘా చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని హెచ్చరిస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లౌడ్ స్పీకర్లు, డిజెలపై నిషేధం విధించారు. ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించుకునేందుకు అనుమతులు తప్పనిసరి చేశారు. కూడళ్లలో, రోడ్లపై కేక్ కటింగ్ చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. న్యూఇయర్ వేడుకల పేరుతో జూదాలు, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళల భద్రతపై దృష్టి సారించారు. పిల్లలు, బాలికలు తల్లిదండ్రులు వెంటలేకుండా బయటకు రాకూడదని ముందుగానే అవగాహన కల్పించారు. ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టేందుకు శక్తి టీం సభ్యులను మఫ్టీలో గస్తీ పెట్టారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురంలోని ప్రముఖ చర్చిల్లో క్రైస్తవులు బుధవారం రాత్రి నుంచే ఉపవాస ప్రార్థనలు చేశారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కొవ్వొత్తులను వెలిగించారు.

ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

ప్రజాశక్తి కాకినాడ

నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 43, 44, 45, 46 డివిజన్లకు సంబంధించిన ప్రజా దర్బార్ కార్యక్రమం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా గాంధీనగర్ మునిసిపల్ హైస్కూల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ భవనాన్ని ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వారు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కొండబాబు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటికి తక్షణ పరిష్కార మార్గాలు చూపడమే ప్రజా దర్బార్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నగరాభివృద్ధి, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు వంటి అంశాలపై ఫిర్యాదులు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. ప్రస్తుత వ్యక్తిగత పెన్షన్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వాటిని సమగ్రంగా పరిశీలించి సమయ పాలనతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను అక్కడికక్కడే నమోదు చేసి, త్వరితగతిన పరిష్కారం అందేలా సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తాయని, ప్రజా సమస్యలపై నేరుగా స్పందించేందుకు ఇవి ఎంతో దోహదపడతాయని ఎంఎల్ఎ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ, అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టిపిఆర్ఓ శైలజ, డిసిసి కృష్ణారావు, స్థానిక కూటమి శ్రేణులు నీలకంఠం సన్నీ కుమార్, బొల్లోజు ఉమామహేశ్వరరావు, గుమ్మళ్ల వెంకటేశ్వరరావు, పిస్సరెడ్డి బుజ్జి, కోకా సత్తిబాబు, కలిదిండి సురేష్, సతీష్, ముడే రాజబాబు, సాదే సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

మద్యం దుకాణాల టైమ్ పెంపుపై ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాల సమయాన్ని రాత్రి ఒంటి గంట వరకూ పొడిగించడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల నాయకులు స్థానిక చిన్న మాంబ పార్క్ మద్యం దుకాణం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు సాకా రామకృష్ణ మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడవలసిన ప్రభుత్వం అధికారంగా ఒంటిగంట దాకా మద్యం దుకాణాలను అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. ఒకపక్క పోలీస్ అధికారులు నూతన సంవత్సరం పేరుతో రాత్రులు రోడ్లమీద తిరగరాదని చెబుతుంటే మరోపక్క ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూసి సమయం పెంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ నాగేశ్వరరావు, రమణ, గణపతి పాల్గొన్నారు. మద్యం దుకాణాల టైమ్ పొడిగించడం బాధాకరం అని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ ఒక ప్రకటనలో ఖండించారు. టైం పొడిగించింది అని ఎవరు వినతులు ఇచ్చారో తెలపాలన్నారు. ఆయినా మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా చూసి ప్రభుత్వం సమయం పెంచిందన్నారు. ప్రజారోగ్యాన్ని, లా అండ్ ఆర్డర్‌ను, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి సమయం పెంచడం దారుణం అన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

బాల్య వివాహ రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది కెఎంఎల్.గణేష్ అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఈ టెక్నో హైస్కూల్లో బాల్య వివాహ నిషేధ చట్టంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ప్రసంగించారు. బాల్యవివాహాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ వివాహాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. పిఎల్‌విబి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలన్నారు. అనంతరం అందరితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

సామర్లకోట డివిజన్ మార్పుపై జిఒ విడుదల

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ జిల్లా పునర్నిర్మాణంలో భాగంగా సామర్లకోట మండలాన్ని కాకినాడ రెవెన్యూ డివిజన్ నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌కు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ గెజిట్ ప్రకారం గురువారం నుంచి సామర్లకోట మండల పరిధిలోని అన్ని గ్రామాలూ పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తాయని పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి తెలిపారు. సామర్లకోట మున్సిపాలిటీతో పాటు మండలంలోని 18 గ్రామాల ప్రజలు ఇకపై సాధారణ పరిపాలనకు సంబంధించిన పనులు, రెవెన్యూ, ఇతర శాఖాపరమైన పనుల కోసం పెద్దాపురం డివిజన్ అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని తెలిపారు.

సొసైటీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -కరప

కరప సొసైటీకు రూ.కోట్లలో చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ అయిన సందర్భంగా ఒక్క రూపాయి కట్టకుండా సమస్యను పరిష్కరించుకున్నట్లు సొసైటీ చైర్మన్ సైనవరపు భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కరప సొసైటీలో జరిగిన కొన్ని తప్పిదాల వల్ల సొసైటీపై సుమారు రూ.3 కోట్ల 50 లక్షలకు డిమాండ్ నోటీసు జారీ అయింది. దీని పర్యవసానంగా సొసైటీ అకౌంట్లు జప్తు అయ్యాయి. అప్పటి ప్రభుత్వంలో రూ.10 లక్షలు చెల్లించి తాత్కాలికంగా అకౌంట్లు విడుదల చేయించారు.

కార్టూ'నిజం'

శానిటేషన్ నిర్వహణపై కౌన్సిల్ ఆగ్రహం

ప్రజాశక్తి-పిఠాపురం

మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ అధ్వానంగా ఉందని కౌన్సిల్ ముక్తకంఠంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ మెరుగుకు అదనపు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం బడ్జెట్ అంచనాల ఆమోదాల కోసం సమావేశం నిర్వహించారు. బడ్జెట్ సమావేశం ప్రారంభంలోనే 28వ వార్డు కౌన్సిలర్ రాయపురెడ్డి పావని తమ వార్డులో ఉన్న ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని నాలుగేళ్ల నుంచి అడుగుతున్నా అధికారులు నేటికీ చర్యలు తీసుకోవడం లేదని చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. మరొక కౌన్సిల్ సభ్యులు రాయుడు శ్రీను మాట్లాడుతూ స్థానిక చిన్నమాంబ పార్కులో ఐ లవ్ పిఠాపురం అని ఏర్పాటు చేయమని కౌన్సిల్ సభ్యులు అందరూ కోరగా నేటికీ అది చేయలేదన్నారు. కౌన్సిల్ సభ్యుడు కోళ్ల బంగారుబాబు మాట్లాడుతూ చిన్నమాంబ పార్కులో పార్కు స్థలదాత విగ్రహం పెద్దదిగా ఏర్పాటు చేయాలన్నారు. రాయుడు శ్రీను మాట్లాడుతూ పట్టణంలో దోమలు ఎక్కువగా, వీధులన్నీ దుర్గంధ భరితంగా ఉన్నాయని ఎక్కడపడితే అక్కడ శానిటేషన్ అధ్వానంగా ఉందని ఆరోపించారు. బొజ్జ జగదీశ్వరి మాట్లాడుతూ డాక్టర్ బండి శ్యామ్‌ప్రసాద్ రూ.14 లక్షలు బకాయిలు ఉండగా మరొకరికి విక్రయించి నూతనంగా పన్ను వేసినట్టు తెలిపారు. ప్రత్యేక అధికారి పాలనలో సుమారు రూ.50 లక్షల పైబడి పన్నులు డబల్ అసెస్మెంట్ ల పేరుతో తొలగించారని వాటిని కట్టించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్లో దుకాణాలకు పన్నులు కడతామంటే అధికారులు కట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆర్ఓ వైవి మోహన్ రంగ మాట్లాడుతూ రెవెన్యూ శాఖపై మున్సిపల్ మేనేజర్ పెత్తనం చేస్తున్నారని తద్వారా సచివాలయ ఉద్యోగులు పనిచేయలేకపోతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కౌన్సిలర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ మున్సిపల్ మేనేజర్ లీవ్ పెట్టి మళ్లీ విధుల్లోకి ఎలా వచ్చారని గత సమావేశంలో కౌన్సిల్ సభ్యులు అందరూ ప్రభుత్వానికి సరెండర్ చేయాలని వినతిపత్రం అందజేసిన నేటికీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రీజినల్ డైరెక్టర్‌కు మున్సిపల్ మేనేజర్ వ్యవహారంపై రాత పూర్వకంగా పంపినట్టు తెలిపారు. జగదీశ్వరి మాట్లాడుతూ శానిటేషన్‌కు అదనపు సిబ్బందిని నియమించాలని ఎంఎల్ఎ దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదని అధికారులను నిలదీశారు. తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ ఇప్పుడైనా మున్సిపల్ ఆఫీస్‌కి వచ్చారా అని ప్రశ్నించారు. మున్సిపల్ స్థలాలు ఆక్రమణలు చేసిన సదరు వ్యక్తులు స్థలం మాది అని కోర్ట్ కి వెళితే మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోరా అని కౌన్సిలర్ నాగేశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. అనంతరం 2025 26 సంవత్సరపు సవరించిన బడ్జెట్ 26 27 సంవత్సరపు అంచనాల బడ్జెట్‌ను ఎటువంటి చర్చ లేకుండానే సభ్యులు ఆమోదించారు. చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించిన పావని మాట్లాడుతూ జనసేన పార్టీలో చేరినందుకే తన వార్డులో అభివృద్ధి పనులకు ఆటంకం కల్పిస్తున్నారని చైర్‌పర్సన్, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోడియం ముందు బైఠాయించిన కౌన్సిలర్ పావని

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజాశక్తి దినపత్రిక క్యాలెండర్‌ను కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి పత్రిక ఉద్యోగులకు, సిబ్బందికి, కాకినాడ నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాశక్తి పత్రిక ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిల పని చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎలఎ కొండబాబు తనయుడు వనమాడి మోహన్ వర్మ, టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్లు ఒమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, ప్రజాశక్తి సిబ్బంది ముమ్మిడి లక్ష్మణ్, జి.చిరంజీవి, దుర్గాప్రసాద్, మంజన్ పాల్గొన్నారు.

ప్రజలకు ఎంఎల్ఎ సత్యప్రభ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలకు కొన్ని అనివార్య కారణాల వల్ల అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు, అధికారులకు, మీడియా మిత్రులకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

2 నుంచి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పరిధిలో రీసర్వే పూర్తైన గ్రామాలలో పాత పట్టాదారు పాస్ పుస్తకముల స్థానే రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ తో పూర్తి అవుతుందన్నారు. సామర్లకోట మండలములోని ఆయా గ్రామములకు సంబంధించి రెవెన్యూ గ్రామసభల ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు పొందే సమయంలో లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరై ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. వివరాల పరిశీలన అనంతరం పాత పట్టాదారు పాస్ పుస్తకాలు వెనక్కి తీసుకున్న తరువాత మాత్రమే వాటి స్థానములో కొత్త పట్టాదారు పాస్ పుస్తకములు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లూ తలెత్తకుండా, పాస్ పుస్తకాలలోని వివరాలను వెబ్ ల్యాండ్ రికార్డులతో కంపేర్ చేసి ధృవీకరించుకుని లబ్ధిదారుల నుంచి తగిన అంగీకార పత్రం కూడా తీసుకుని పంపిణీ చేస్తామన్నారు.

న్యూ ఇయర్ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోనిఆర్‌ఆర్‌బి హెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన సంవత్సర వేడుకల ఏర్పాట్లను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ ఎంపీ తంగెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ముందస్తు ఏర్పాట్లను పరిశీలించినట్టు తెలిపారు. ఈ వేడుకలకు సుమారు 20 వేల మంది రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు కూడా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సురవరపు సురేష్, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ దానం లాజర్ బాబు, జోగ వీర వెంకటరమణ, బిఎన్.రాజు, కమల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగతాయారు

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి-కాకినాడ, సామర్లకోట

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో సంక్షేమం పథకాల అమలు, అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయని, కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలు అందుకొంటుందని ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. బుధవారం కాకినాడ కార్పొరేషన్‌లోని 41వ డివిజన్ మల్లయ్య అగ్రహారంలో పలువురు లబ్ధిదారులకుకమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణ, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, దువ్వారపు రామారావుతో కలిసి ఎంఎల్ఎ కొండబాబు ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలను అమలు చేశామని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి కుటుంబం ఆనందంగా ఉందని తెలిపారు. గడిచిన 18 నెలల్లో ఒక్కరోజు కూడా ఆలస్యం కాకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, అవసరమైతే ఒక రోజు ముందుగానే ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా నిధులు, రైతులకు అన్నదాతా సుఖీభవ నిధులు, మహిళలకు దీపం 2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డిఎస్‌సి ద్వారా ఉద్యోగ నియామకాలు, ఇంకా అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను ఏడాదిన్నరలోనే పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, స్థానిక నాయకులు జొన్నాడ వెంకటరమణ, మైలపల్లి విద్యాసాగర్, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లక్ష్యంగా పని చేస్తుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. బుధవారం పనసపాడు గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్, మాట్లాడుతూ పనసపాడులో మొత్తం 470 మంది లబ్ధిదారులకు రూ.20,91,500/ మేర పెన్షన్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలాగే పట్టణ మండల పరిధిలో కూటమి నాయకులు, అధికారులు పెన్షన్ లు పంపిణీ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగతాయారు

నగర పంచాయతీ బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

నగర పంచాయతీ 2026 -2027 వార్షిక బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, కమిషనర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2026-2027 వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రారంభ నిల్వ రూ.772.30 లక్షలకు గాను రాబడి నిల్వతో కలిపి రూ.1197.80 లక్షలు కాగా 2026-2027కు రూ.రెండు కోట్ల 98 లక్షల మిగులు అంచనాని వేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంగతాయారు మాట్లాడుతూ నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. సభ్యులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బడ్జెట్‌ను మేనేజర్ నవీన్ చంద్ర చదివి వినిపించగా ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిలర్లు గండ్రెడ్డి శ్రీరామచంద్రమూర్తి, గంటా అప్పలస్వామి, బెందుకుర్తి సత్తిబాబు, గుళ్ల సుబ్బారావు, మైనం భవాని, ఈరుగుల యేసు, ఎఇ అలీషా, టౌన్ ప్లానింగ్ అధికారి నీలిమాదీప్తి పాల్గొన్నారు

2న వికలాంగులకు జిల్లా స్థాయి క్రీడలు

ప్రజాశక్తి-కాకినాడ

జనవరి 4న ప్రపంచ బ్రెయిలీ డే, 217వ లూయిస్ బ్రెయిలీ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకొని వికలాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎవై.శ్రీనివాస్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు, ప్రత్యేక పాఠశాలల విద్యార్థులు, పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు జనవరి 2న ముందుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో సంభందిత కోచ్‌లను సంప్రదించి, పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ తిరగబడి యువకుని దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శివారు కోదండరామపురం ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కాకర రాజు (26) దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ తిరగబడి దుర్మరణం చెందాడు. బుధవారం కాపవరం గ్రామం వద్ద దమ్ము చేస్తుండగా రాజుకు ఫిట్స్ రావడంతో ట్రాక్టర్ అదుపు చేయలేక ప్రమాదం సంభవించింది. గమనించిన స్థానికంగా ఉన్న రైతులు రాజును సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు.

డీజిల్ స్వాధీనం

ప్రజాశక్తి -తాళ్లరేవు

యానాం నుండి డీజిల్ ఆయిల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి వెయ్యి లీటర్ల డీజిల్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు కోరంగి ఎస్. ఐ. సత్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో గొల్లప్రోలు గ్రామానికి చెందిన వెన్న శ్రీను, కర్రి అశోక్‌ను అరెస్టు చేసి టాటా వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా యానాం నుంచి డీజిల్ ఆయిల్ అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కొడవలితో మహిళపై దాడి

ప్రజాశక్తి - సామర్లకోట

సత్యనారాయణపురంలో నివాసముంటున్న ఒక మహిళపై బుధవారం ఒక వ్యక్తి కొడవలితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం రావు లక్ష్మి రైలులో పువ్వులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె స్థానిక సామర్లకోట సత్యనారాయణ పురంలో ఒంటరిగా నివసిస్తుంది. రైల్వే స్టేషన్లో టీ అమ్ముకునే కాయ రాజా అనే వ్యక్తి లక్ష్మి ఇంటికి వచ్చి కొడవలితో లక్ష్మి కాళ్లు చేతులపై దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్

భారీ చోరీ కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలోని కరప పోలీస్ స్టేషన్లో ఇటీవల చోటు చేసుకున్న భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. 24 గంటల్లోనే నిందితుని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి రూ.21.05 లక్షల నగదు, 210 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్ బుధవారం ఆయన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కాకినాడ పర్లోపేటకు చెందిన సుంకర తేజ మేస్త్రీగా పని చేస్తూ, వివిధ ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నగర పరిధిలోని కాకినాడ 3 టౌన్, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులకు సంబంధించి 13 కేసుల్లో ఇతడే నిందితుడని నిర్ధారించారు. తేజ పర్లోపేటలో ఉన్నాడని రూరల్ సిఐ డిఎస్ చైతన్య కృష్ణకు సమాచారం రావడంతో కరప పోలీసులు అతన్ని పట్టుకున్నట్టు పాటిల్ తెలిపారు. నిందితుడు తేజను కోర్టులో హాజరు పరిచామన్నారు.ఉ అతడు ఇప్పటి వరకూ 13 చోరీలకు పాల్పడినట్టు డిఎస్‌పి గుర్తించారు.

40 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - గోపాలపురం

కోడి పందేలా కోసం కోడి కత్తులను తయారు చేస్తున్న కేంద్రంపై పోలీసులు దాడులు చేసి 40 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. మండలంలోని హుకుంపేటలో కోడి కత్తులను తయారు చేస్తున్నారని పోలీసులు సమాచారం అందింది. ఈ మేరకు ట్రైనీ ఎస్ఐ పి.శివగణేష్ సిబ్బందితో తయారీ కేంద్రంపై దాడి చేశారు. హుకుంపేటకు చెందిన బొల్లం హరికృష్ణను అరెస్టు చేశారు. అతని నుంచి 40 కోడి కత్తులను, తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తలి, కుమార్తెను రక్షించిన శక్తి టీము

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరులోని రోడ్డు కమ్ రైలు వంతెన పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లీకూతుళ్లను శక్తి టీం సిబ్బంది రక్షించారు. 112కి కాల్ రావడంతో శక్తి టీమ్ సభ్యులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తున్న మమిళను, ఆమె కుమార్తెను రక్షించారు. కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబంలో ఏర్పడి సమస్యలతో మనస్తాపం చెంది ఆత్మ హత్యకు పాల్పడిందని తెలిపారు. పట్టణ సిఐ విశ్వం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మాతృత్వం కార్యక్రమానికి డిఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్బుక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమం వంటివి అన్ని చోట్లా నిర్వహించాలని డిఎస్‌పి శ్రీహరి రాజు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు అన్నదానంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 90 వారాలుగా గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తున్న మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న దాతలను డిఎస్‌పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవీన్ నాని, ఆనంద్, వడ్డి సత్యనారాయణ, రాఘవులు, సతీష్, హర్ష, భుజంగరావు, జయశ్రీ, నాగలక్ష్మి, జి.ఉమా శేఖర్, కె.లక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సిపిఎం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగర ప్రజలకు సిపిఎం నగర కమిటీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. నగర ప్రజలు, ముఖ్యంగా శ్రమజీవులకు శుభాకాంక్షలు తెలిపారు. 2026లో నగరంలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలు తమ వంతు పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఏ మతమైనా, ఏ కులమైనా మనమంతా భారతీయులమే అనే స్ఫూర్తితో దేశ సమైక్యత సమగ్రత కోసం ప్రజలంతా నిలబడాలని సిపిఎం కోరుతోందన్నారు. గడిచిన మూడేళ్లుగా సంవత్సరాలుగా నగరంలో పాలక వర్గం లేకపోవడం వల్ల సమస్యలు పేరుకు పోతున్నాయని, 2026లో అయినా కాకినాడ నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలన్నారు.

చొల్లంగిలో పింఛన్లు అందిస్తున్న ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు

ప్రభుత్వాన్ని సుస్థిరం చేయాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రజలకు నిరంతరం సంక్షేమం అభివృద్ధితో పాటు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు సుస్థిరం చేయాలని ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు కోరారు. మండలంలోని చొల్లంగిలో బుధవారం ఆయన పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఈ నెల ఫించన్ పంపిణీ ద్వారా నిరుపేదలకు ముందుగానే నూతన సంవత్సరం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలతో గత పాలకులు చేసిన విధ్వంసం నుంచి ప్రధాని మోడీ సహకారంతో రాష్ట్రాన్ని కాపాడి అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తోందన్నారు. ప్రజలు ఏ ప్రభుత్వం వల్ల మన రాష్ట్ర భవిష్యత్, పిల్లలు భవిష్యత్ బాగుంటుందో ఆలోచన చేసి కూటమి ప్రభుత్వాన్ని సుస్థిరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు ధూళిపూడి బాబీ, కట్టా త్రిమూర్తులు, కూటమి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, పి.రామలక్ష్మి, కనకాల చినబాబు, గర్రే లక్ష్మీనారాయణ, పుణ్యమంతుల సత్తిబాబు, గండి అప్పారావు, సీకాల సత్తిబాబు, దంగేటి అన్వేష్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఇంటి పన్నుల బకాయిలన్నీ నూరు శాతం వసూలు చేయాలని ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రైన్లు అవసరమైన చోట మ్యాజిక్ డ్రైన్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో హాజరు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, వై.శ్రీహరి, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విపిన్ కుమార్ పిలుపునిచ్చారు. ఏలేశ్వరం ప్రభుత్వోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సరదాగా ప్రారంభమైన వ్యసనం వారి జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అక్షరమే ఆయుధంగా ఎదగాల్సిన విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాక కుటుంబాలు విచ్ఛిన్నమైపోతాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, సమాజ మార్పు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులందరూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతామని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు షణ్ముఖ్, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కరప

అంబేద్కరిస్టు, రచయిత సవిలే రాజేష్ రూపొందించిన 2026 అంబేద్కర్ క్యాలెండర్‌ను కాకినాడ లైఫ్ లైన్ హాస్పిటల్లో బుధవారం డాక్టర్ కోరుకొండ భానుమతి ఆవిష్కరించారు. అనంతరం భానుమతి మాట్లాడుతూ రాజేష్, సవిలే ఫౌండేషన్ సంస్థ ద్వారా 15 ఏళ్లుగా అంబేద్కర్ పేరుతో క్యాలెండర్ తీసుకురావడమే కాక పలువురు నాయకుల జీవిత చరిత్రలను పుస్తకం రూపంలో తీసుకొస్తుండడం అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ యూనిర్సిటీ మాజీ వైస్. ఛాన్సలర్ డా. కోరుకొండ బాబ్జి , స్టేట్ గూడ్స్ %ఽ% సర్వీస్ టాక్స్ అధికారి శ్రీ సాంబత్తుల వెంకటరావు , రిటైర్డ్ ఎం.పి.డి.ఒ మారెళ్ళ రాఘవులు , రిటైర్డ్ పోలీస్ పేరెళ్ల చంద్రరావు ,డపాటి రాజకుమార్ , అడ్వకేట్ తప్పెట్ల ప ధ్వీరాజ్, రిటైర్డ్ లెక్చరర్ కాశి రామారావు , కరపమండల దళిత నాయకులు మాత అప్పారావు శ్రీ చిన్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టగ్ ఆఫ్ వార్‌లో నాయుడుకు కాంస్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఢిల్లీలో నిట్ నిర్వహించిన ఆలిండియా ఇంటర్ నిట్ స్పాట్ టగ్ ఆఫ్ వార్ కాంపిటీషన్ 2025లో పెద్దాపురం సర్వారాయుడు కాలనీ కింగ్స్ ఒపేరా అపార్ట్మెంట్ నివాసి చిక్కం సత్యప్రసాద్, సుజాత దంపతుల కుమారుడు చిక్కం శివ మాణిక్యానాయుడు కాంస్య పతకం సాధించాడు. శివ మాణిక్యానాయుడు జీ మెయిన్స్ 2023లో ఆలిండియా ర్యాంకు సాధించి నిట్‌లో చదువుతున్నాడు.

ఉపాధ్యాయుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం టిడిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌విఎస్‌ఎన్.వర్మ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, భవిష్యత్తులో ఉపాధ్యాయులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చేలా, విద్యా రంగ అభివద్ధికి నిరంతరంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు నామా కృష్ణ మోహన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ముందుకు తీసుకెళ్తున్న విధానాలకు అనుగుణంగా సంఘం పని చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో రాష్ట్ర విద్యా రంగం మరింత పురోగతి సాధిస్తుందని, ఆ దిశగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యులు ఉపాధ్యక్షుడు ఎస్.బెన్‌జాన్‌సన్, హెచ్ఎం పెద్దబ్బాయి, ఉపాధ్యాయులు శ్రీనివాసు, కొండలరావు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా నారాయణమూర్తి పుట్టిన రోజు

ప్రజాశక్తి-కోటనందూరు, రౌతులపూడి

పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి పుట్టిన రోజు వేడుకలను బుధవారం శ్రీఅల్లూరి సీతారామ రాజు సేవా కమిటీ అధ్యక్షుడు లక్కాకుల బాబ్జి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. బుధవారం కోటనందూరులో గ్రామ సచివాలయం దగ్గర పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ సినిమా ఫీల్డులో ఖరీదైన కార్లు బంగ్లాలు, డాబు దర్పం ప్రదర్శించడం సహజంగా చూస్తూ ఉంటామని, కానీ ఆర్.నారాయణమూర్తి అలాంటి ఆర్భాటలకు దూరంగా ఉంటూ నిరాడంబర జీవితాన్ని గడుపుతూ ఉంటారు. తన సంపాదనతో ఒక ప్రభుత్వాసుపత్రి, రామాలయం నిర్మించారని, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం చేశారని, రైతులకోసం తాండవ జలాశయంలోనికి అదనపు జలాల్ని ఇప్పించాలని తీవ్ర కృషి చేశారని తెలిపారు. కమిటీ సభ్యులు కోన రాంబాబు, అనకాపల్లి రమణ, గజ్జలపు జయ, చింతాకుల వెంకటేష్, లక్కాకుల గోవింద, పాలికశ్రీను, బుద్ద చెల్లారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రౌతులపూడి నారాయణమూర్తి జన్మదిన వేడుకలను ఆయన సోదరుడు ఆర్.బుల్లబ్బాయి ఆధ్వర్యంలో స్థానిక సిహెచ్‌సి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి రోగులకు పంచారు. ఓమ్ ఫౌండేషన్ నిర్వాహకులు సుర్ల శ్రీను ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద నారాయణమూర్తి అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. రౌతులపూడి మండలాభివృద్ధికి నారాయణమూర్తి చేసిన సేవలను కొనియాడారు. ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కొనుగోలు చేసి దానం చేయడంతో పాటు నిర్మాణ పనులకు అవసరమైన నిధులు సైతం అందజేశారని ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఉమామహేశ్వర రెడ్డి, వైద్యులు ఎ.సౌమ్య, అజయ్, ఆరోగ్య మిత్ర శ్రీనివాస్, గణేష్ ఉన్నారు.

యానాం వార్తలు

ఎస్ఐలుగా ప్రమోషన్ ఉత్తర్వుల జారీ

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఎస్ఐలుగా ప్రమోట్ చేస్తూ హోమ్ శాఖ కార్యదర్శి ఎంవి.హిరాన్ ఆదేశాలు జారీ చేశారు. దాసరి పట్టాభిరామయ్య, కాలే సుబ్రహ్మణ్యంకు ఎస్ఐలుగా ప్రమోషన్ లభించింది. పుదుచ్చేరివ్యాప్తంగా 26 మందికి ప్రమోషన్ కల్పించారు. వీరందరికీ 90 రోజుల పాటు పుదుచ్చేరి పోలీస్ ట్రైనింగ్ స్కూల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఎంఎల్‌ఎ గొల్లపల్లి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలు, కార్యకర్తలకు అభిమానులకు యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. గురువారం ఉదయం నుంచి గోపాల్ నగర్ తన ఇంటి వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజలెవరూ శాలువాలు, పూలదండలు తీసుకురావద్దని కోరారు.

నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం

ప్రజాశక్తి - యానాం

యానాంలో నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధమైంది. నూతన సంవత్సరం వేడుకలకు ప్రజలందరూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పలు స్వీట్ల షాపుల్లో నూతన సంవత్సరం-2026 పేరిటా భారీ కేక్‌లు తయారు చేసారు. స్థానిక గోపాల్ నగర్‌లోని శ్రీవేద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 2026 సంవత్సర అంకెను ప్రదర్శించారు. మినీ సివిల్ స్టేషన్ వద్ద గల సీగల్స్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో తందూరి స్పెషల్ వంటాకాలను లైవ్‌లో ఏర్పాటు చేశారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - సామర్లకోట

రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశాలకు హాజరు కాని వైసిపి కౌన్సిలర్లు బుధవారం కౌన్సిల్ సాధారణ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యారు. అధికారులు పూర్తిస్థాయిలో లేకుండా బడ్జెట్ సాధారణ జెండా ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తూ సమావేశాన్ని వాయిదా వేయాలని పట్టుబట్టడంతో సమావేశాలు వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. చైర్‌పర్సన్ అరుణ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో అనిశెట్టి శ్రీవిద్య ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ, బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోజెష్, గోకిన సునేత్రాదేవి సహా మెజారిటీ వైసిపి సభ్యులు హాజరయ్యారు. కమిషనర్ తప్ప మిగిలిన శాఖల అధికారులు ఎందుకు హాజరు కాలేదని, నెలకు ఒకసారి జరిగే సమావేశానికి హాజరు కాకపోతే ఎలాగని జాన్ మోజెస్, నేతల హరిబాబు తదితరులు ప్రశ్నించారు. ఇన్చార్జితో సమావేశం నిర్వహణకు సహకరించాలని కమిషనర్ శ్రీవిద్య చెప్పారు. అధికారులు లేకుండా బడ్జెట్ సమావేశం ఎలా నిర్వహిస్తారని అజెండాలో అంశాలకు ఎవరు సమాధానాలు చెప్తారని వైస్ చైర్మన్ మోజెస్ వాదిస్తూ కౌన్సిల్ సమావేశాలు వాయిదా వేసి తదుపరి నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెజారిటీ సభ్యులు వాయిదాకు పట్టు పట్టడంతో సమావేశాలను వాయిదా వేశారు.

కౌన్సిలర్ మన్యం చంద్రరావు రాజీనామా:

సమావేశం వాయిదా పడిన అనంతరం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్ర రావు తన పదవికి రాజీనామా చేస్తూ మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు రాజీనామా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా మన్యం చంద్రరావు మాట్లాడుతూ తనను మెజారిటీతో కో ఆప్షన్ సభ్యునిగా ఎన్నుకున్న కౌన్సిల్ సభ్యులకు కతజ్ఞతలు చెప్పారు. వ్యక్తిగత కారణాలతో తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లు మన్యం చంద్రరావు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్ కుమార్, సేపేని సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్

పార్కుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం : ప్రజలకు అసౌకర్యం కలగకుండా నగరంలో పార్కుల సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. బుధవారం మోరంపూడి రోడ్డులోని తెలుకుల వారి చెరువు పార్కును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్లతో మాట్లాడి పార్కులో సదుపాయాలపై ఆరా తీశారు.

జనవరి నుంచి గోధుమపిండి పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్ : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాజమహేంద్రవరం అర్బన్‌లో జనవరి నుంచి ప్రతీ రేషన్ కార్డుకు ఒక కేజీ గోదుమ పిండిని రూ.20కే అందజేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని అన్ని చౌక ధరల దుకాణాలకు మొత్తం 62.400 మెట్రిక్ టన్నుల గోదుమపిండిని కేటాయించినట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజల కోసం పనిచేసే పత్రిక ప్రజాశక్తి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

సమాజంలో ప్రజల కోసం పనిచేసే పత్రిక ప్రజాశక్తి అని రాష్ట్ర రోడ్ల డెవలప్మెంట్ డైరెక్టర్ వెన్నా శివ అన్నారు. 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కత్తిపూడి టిడిపి కార్యాలయంలో వెన్నా శివ, టిడిపి యువ నాయకుడు చక్కపల్లి నవీన్, టిడిపి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. శివ మాట్లాడుతూ సమాజంలో నిత్యం ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రజలు పడుతున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రజాశక్తి పత్రిక ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గాబు కృష్ణ, కేలంగి జనార్ధన, మత్సరాజు, కంచిబోయిన శ్రీను, కొయ్యా రమణ, నక్కా శ్రీను, రౌతు శివ, నాయుడు బుజ్జి, గంపల ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాలు జిల్లాలో విలీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌కు చెందిన మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్‌లో విలీనం అయ్యాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సంబంధిత ప్రాంతాల మెరుగైన పరిపాలన, అభివృద్ధి దృష్ట్యా ఈ మార్పులు చేపట్టినట్లు తెలిపారు. ఈ మార్పులు డిసెంబర్ 31వ తేదీ 2025 నుంచి అమలులోకి వచ్చాయన్నారు. ఈ విలీనంతో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో కడియం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేటతో పాటు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు చేరాయన్నారు.

పురపాలక సంఘ కార్యాలయం, పెద్దాపురం

ఆర్.ఒ.సి.నెం.606/2025-ఇ1 తేదీ.30-12-2025

షార్టు టెండర్ నోటీసు

పెద్దాపురం పురపాలక సంఘమునకు సంబంధించి శతాబ్ది పార్కును తాత్కాలికముగా ది.01-01-2026 నుండి ది.31-12-2027 వరకు రెండు సంవత్సరముల కాల పరిమితికి కౌన్సిల్ వారి తీర్మానం నెం.419, తేదీ.30-10-2025 మరియు 456, ది. 27-11-2025 ననుసరించి షరతులకు లోబడి లీజు పద్ధతిపై అప్పగించుటకు గాను సీల్డు టెండర్లు ది. 09-01-2026న సాయంత్రం 4-00 గంటల వరకు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం గం॥ 4-30లకు అప్పటికి హాజరు అయిన టెండరు దారుల సమక్షంలో కమిషనర్ వారు గాని, వారి అనుమతి పొందిన వేరొక అధికారి వారిచే గాని టెండర్లు తెరువబడును. టెండర్ సమయము మార్చుటకు లేక టెండర్ రద్దు చేయుటకు కమిషనర్ వారికి పూర్తి అధికారం కలదు. టెండర్ డిపాజిట్ డిమాండ్ డ్రాఫ్ట్ రూపములో కానీ, ఈ కార్యాలయం ట్రెజరీ నందు గాని నిర్ణీత సమయములో కమిషనర్, పెద్దాపురం పురపాలక సంఘం వారి పేరు మీద తీసి, షెడ్యూల్‌నకు జత చేసి టెండర్ దాఖలు పర్చవలెను. సక్రమముగ లేని టెండర్ షెడ్యూల్ పరిగణ లోనికి తీసుకొనబడవు.

ఇతర వివరములకు ఆఫీసు పని వేళల యందు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారిని గాని లేక ఇంజనీరింగ్ విభాగం నందు గాని సంప్రదించవలెను.

1. టెండర్ షెడ్యూల్ ఖరీదు రూ. 1000/-
2. టెండర్ ధరావతు రూ. 2,00,000/-

టెండర్ షెడ్యూల్‌నకు రుసుము చెల్లించుటకు ఆఖరు తేదీ : 08-01-2026
టెండర్ ధరావతు చెల్లించుటకు ఆఖరు తేదీ : 08-01-2026
టెండర్ షెడ్యూల్ జారీ చేయు మరియు టెండర్ దాఖలు చేయు తేదీ : 09-01-2026

సం/- కమిషనర్, పెద్దాపురం పురపాలక సంఘం

PUBLICATION IN THE COURT OF THE HON"BLE CIVIL JUDGE SENIOR DIVISION AMALAPURAM

IA.No.62/2023 in O.S.No.49/2023

Between:-

Thota Pundarikashulu, S/o.Satyanarayana, Hindu,Business, age51years, Resident of MuslimStreet, Amalapuram, Dr.BRA Konaseema Distric. ...Petitioners/Plaintiffs

Vs

Kakarlapalli Varalakshmi, W/o. Annavaram Satyanarayana, D.No.1-196, Mallepalli Village, Gandepalli Mandal,Kakinada District. ...3rd respondent.D3

The above named plaintiff has instituted the above suit as well as I A. The matter stands posted to **02-01-2026 at 10.30 A M** for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at **10.30 AM** and file your objections if any, failing which the matter will be heard and determined in your absence exparte as per Law.

(By the Orders of the Hon'ble Court)
M.Adinarayana Rao
Advocate, Amalapuram, Dt.29-12-2025

మహారాజశ్రీ అమలాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.92/2013 in O.S.No.27/2005

Between:-

సంకు ఏడుకొండలు ... DHR

And

పేరాబత్తుల చంద్రావతి And Others ...JDRs

1. పేరాబత్తుల చంద్రావతి W/o.(late)కృష్ణమూర్తి, డోర్‌నెం.2-42,తొండవరం,అంబాజీపేట మండలం.
2. నందెపు లక్ష్మి సత్యవతి, W/o.(late)రామకృష్ణ, డోర్‌నెం.1-4-28/2, దుద్దువారి అగ్రహారం, అమలాపురం.
3. యర్రంశెట్టి సోమమ్మ , W/o.రమణయ్య, డోర్‌నెం.2-85, ఈతకోట,రావులపాలెం.
4. సంకు మణి, W/o.ఏడుకొండలు, డోర్‌నెం. 2-85, భువనపల్లి, తాడేపల్లిగూడెం.
5. తోట లక్ష్మి శకుంతల,W/o.రామస్వామి నాయుడు, డోర్‌నెం.8-1-2/1, తొండవరం, అంబాజీపేట మండలం.
7. పేరాబత్తుల ఏసుబాబు S/o.(late) కృష్ణమూర్తి, డోర్‌నెం.2-42,తొండవరం,అంబాజీపేట మండలం.
8. దున్న విజయలక్ష్మి, W/o.వరప్రసాదు, డోర్‌నెం. 11-88, నల్లావారి వీధి, అమలాపురం.

...JDR'S 1 to 5 మరియు 7and 8

పై నెంబరు పిటిషనును డిక్రిబాకీ వసూలు నిమిత్తం DHR దాఖలు చేసినారు. ఇందుకోర్టు వారు JDR కు నోటీసు ఆర్డరు చేయగా **JDR'S 1 to 5 మరియు 7and 8.** లు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకొనక పోవుటచే శ్రీ కోర్టువారు ఈ పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున **ది.08-01-2026** సం॥తేదిన ఉదయం **10.30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కానీ హాజరు కావలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం)
N.V.సూర్యనారాయణ
N.V.కృష్ణమూర్తి
అమలాపురం అడ్వకేట్స్,అమలాపురం
ది.30-12-2025 సెల్.9440842076

CHANGE OF NAME

My Old name is **NAGAMANI BADAM** W/o. **BADAM KRISHNAPRASAD**, My Changed Name is **NAGADEVI BADAM** W/o. **BADAM KRISHNAPRASAD**. Since today onwards I am being Called as **NAGADEVI BADAM** W/o.**BADAM KRISHNAPRASAD**

NAGADEVI BADAM
D.No.35-1-74/4,
Kanchumarthy Vari Street,
Mangalavarapupeta,
Rajahmundry Urban-533101
Cell.8978917107

ఒరిజినల్ డాక్యుమెంట్లు పడిపోయినవి

నా పేరు పసల ధర్మరాజు తండ్రి పసల పెద్దిరాజు, డోర్ నెం:1-69/1, తిరుమాలి గ్రామం, ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా. నేను ది.10-12-2025 వ తేదీన నా ఒరిజినల్ దస్తావేజులు జిరాక్స్ నిమిత్తం తిరుమాలి గ్రామం నుండి ఏలేశ్వరం బాలాజీ సెంటర్ కు ఆటోలో వెళుతుండగా పడిపోయినవి. నా ఒరిజినల్ దస్తావేజు **నెంబర్:2247/2012** గా రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ దస్తావేజు పడిపోయినవి. ఎంత ప్రయత్నించినా అవి దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు గాని, ఫోన్ నెంబర్ కు గాని తెలియజేయ వలసినదిగా కోరుతున్నాను.

పసల ధర్మరాజు
తండ్రి పసల పెద్దిరాజు, డో.నెం:1-69/1,
తిరుమాలి గ్రామం, ఏలేశ్వరం మండలం,
కాకినాడ జిల్లా, 533429,
సెల్:9848647925.

ప్రకటన

కాకినాడ జిల్లా పెద్దాపురం వాస్తవ్యులు బీరక సుబ్బారావు గారి కుమారుడు బీరక బసవలింగం గారు మాకు ఇచ్చిన సంజాయిషీ పై ఈ ప్రకటన పూర్వకంగా తెలియజేయునది ఏమనగా మా క్లైంటు బీరక బసవలింగం గారి తండ్రి సుబ్బారావు గారు తల్లి గృహలక్ష్మి గారు కలసి దిగువ షెడ్యూలు ఆస్తి ది.18-01-1977 DocNo.43/1977 గా మాడా మల్లికార్జున రావు గారి వద్ద కొనుగోలు చేసి ఉన్నారు. దరిమిలా బీరక సుబ్బారావు గారు తన సగభాగం తన అనంతరం తన భార్య గృహలక్ష్మి కు చెందేలాగా ది.09-01-1979 DocNo.1/1979 గా ఆఖరి వీలునామా వ్రాసి ది.25-01-2022 తేదీన కాలం చేసినారు. దరిమిలా బీరక గృహలక్ష్మి గారు తన కుమారుడు బసవలింగం గారి పేరున ది.06-02-2023 DocNo.704/2023 సెటిల్మెంట్ దస్తావేజు రీత్యా మరియు ది.15-03-2024 DocNo.8513/2024 సవరణ దస్తావేజు రీత్యా తన భాగము తన భర్త గారి వీలునామా ద్వారా దాఖలుబడిన భాగము కలిపి వ్రాయించి ఇచ్చి ఉన్నారు. మా క్లైంట్ సదరు ఆస్తిపై బ్యాంకు రుణము పొందుచున్నారు. కావున సదరు వీలునామాపై మరియు ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లు అయితే వారం రోజుల్లోగా ఆధారాలతో మా క్లైంటుకు తెలియపరచవలెను.

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పెద్దాపురం సబుడి పెద్దాపురం మున్సిపాలిటికి చెందిన పాత వార్డు 10 క్రొత్త 9 నాగం పేటలో TS No.3-8-444 D.No.11-2-4 పాత అసెస్మెంట్ 3320 క్రొత్త 1062003505 గ్రౌండ్ ఫ్లోర్ ఫస్ట్ ఫ్లోర్ సెకండ్ ఫ్లోర్ మేడ స్థలం కు హద్దులు

తూరు :- 18-9 రాజవీధి, ధక్షిణం:- 54 రూత్తల సింహాచలం గారి ఇల్లు స్థలం, పడమర:- 18-9 గేదెల శ్రీనివాస్ గారి ఇల్లు స్థలం, ఉత్తరం :- 54 పడాల గాంధీ గారి ఇల్లు స్థలం సదరు హద్దుల మధ్య 112-5 చ.గ.లేక 94.06చ మీ గ్రౌండ్ ఫస్ట్ ఫ్లోర్ డాబా ఇల్లు స్థలం కరెంటు ఈజ్మెంట్లు హక్కులతో సహా

పి.మృత్యుంజయరావు
అడ్వకేట్, డోర్‌నెం.11-6-7
నాగమ్మపేట, పెద్దాపురం
సెల్.9848113611